క్లుప్తంగా

వినతుల స్వీకరణ


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో మంగళవారం ఆర్డీఓ వెంకటరెడ్డి గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి గ్రామంలో ఉన్న సమస్యలపై ఆరాతీశారు. గ్రామస్తులు పలువురు తమ భూముల సమస్యలపై ఆర్డీఓ వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను త్వరలో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు కలుగుతాయని, ధరించకపోతే ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరణ ఇచ్చారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు చెప్పారు. మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాల పట్ల ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్, సర్పంచ్ బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం వాతావరణంలో తలెత్తిన మార్పు వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు లోకేష్, మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా గ్రామాల్లో అంటు వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వంటివి రెండు మూడు రోజులు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్


సారా విక్రేత అరెస్టు చూపుతున్న పోలీస్

నగరి : మండలంలోని గుండ్రాజకుప్పం గ్రామ సమీపంలో సారా విక్రయిస్తున్న అడవి కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులును పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు కాపు కాసి శ్రీనివాసులును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. అతనికి కోర్టులో 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు.

ఎలక్ట్రికల్ షాపు దగ్ధం


ప్రమాదంలో దగ్ధమైన ఎలక్ట్రికల్ షాపు

నగరి : మున్సిపల్ పరిధిలోని కొత్తపేట వినాయకుడి ఆలయం సమీపం అరుణగిరి అనే వ్యక్తికి చెందిన ఎలక్ట్రికల్ షాపు సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఎలక్ట్రికల్ వస్తువులు రిపేర్ చేసి ఇస్తూ అందులో వచ్చే ఆదాయంతో జీవనాన్ని కొనసాగిస్తున్న అరుణగిరి యథావిధిగా తన షాపును మూసి ఇంటికి వెళ్లగా రాత్రి అకస్మాత్తుగా షాపు నుంచి మంటలు వచ్చి కాలిపోతుండడాన్ని స్థానికులు గుర్తించి అతనికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పినా వస్తువులన్నీ పూర్తిగా కాలిపోవడంతో అరుణగిరి వీధిన పడ్డాడు. ప్రభుత్వమే అతన్ని ఆదుకోవాలని ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి కోరారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశ ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియెట్, తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు అర్హులన్నారు. బీఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్లు, బీఎస్సీ బాటనీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10వ వరకు అడ్మిషన్లు జరుగుతుందని ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు సమర్పించాలని కోరారు. వివరాలకు 9885125771, 7702917803 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేలతల్లిని తోడేస్తున్నారు..

సహజసిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు కూటమి నేతలకు కాసుల వాన కురిపిస్తున్నాయి. రైతులకు కల్పతరువుగా ఉన్న చెరువులు సైతం అక్రమార్కుల మట్టి, గ్రావెల్ దందాకు నిలయంగా మారాయి. పచ్చని కొండలు, గుట్టలను మాయం చేస్తున్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొందరు మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకొంటున్నారు. రోజూ వేల టన్నుల మట్టిని తోడేస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి చోటా నాయకులు కొండలను సైతం పిండేస్తున్నారు. అయినా కూడా రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- మట్టి మాయం.. అక్రమార్కులకు వరం
- ఆగని మట్టి దోపిడీ
- నిద్రావస్థలో రెవెన్యూ, మైనింగ్ శాఖ

వెదురుకుప్పం: అధికారుల అలసత్వం.. ప్రభుత్వం ఉదాసీనత అక్రమార్కులకు వరంగా మారింది. ఆహ్లాదాన్ని పంచి పెట్టే కొండ గుట్టలను నిత్యం జేసీబీలు, హిటాచీలు, ట్రాక్టర్లతో పిండి చేస్తూ అడవితల్లిని కనుమరుగు చేస్తున్నారు. ప్రధానంగా మండలంలోని పచ్చికాపల్లం, కొమరగుంట, వెదురుకుప్పం, నల్లవెంగపల్లె, బొమ్మయ్యపల్లె, జక్కిదొన, తిరుమలయ్యపల్లె పరిసర ప్రాంతాల్లో పచ్చని గుట్టలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈ గుట్టలను యంత్రాలతో తవ్వి మట్టిని తరలించేస్తున్నారు.


పచ్చికాపల్లం సమీపంలో గుట్ట వద్ద గ్రావెల్ డంప్


పచ్చికాపల్లం సమీపంలో మట్టిని తోడేయడంతో కరిగిపోయిన గుట్ట

నిత్యం వేల టన్నులు మట్టిని తరలించి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు. ముఖ్యంగా ఎలాంటి అనుమతి లేకుండా చెరువుల్లో మట్టిని కూడా తోడేస్తున్నారు. తద్వారా చెరువుల్లో చుక్క నీరు కూడా నిల్వ ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లెదుటే మట్టి తోడి ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నా అధికారులు మిన్నకుంటున్నారని ఆరోపిస్తున్నారు. యూనిట్ రూ.450 చొప్పున రవాణా చేసి దండుకుంటున్నారు. కూలీలతో అయితే ఒక ట్రిప్పు రూ.650 నుంచి రూ.700 వరకు రవాణా చేస్తున్నారు. దూరాన్ని బట్టి వెయ్యికి పైమాటే. అయితే రోజుకి వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తూ లక్షల ఆదాయం ఆర్జిస్తున్నారు.

దోపిడీ ఇలా...

మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వాళ్లు, ఇటుక బట్టీ వ్యాపారులు మట్టిని మాయం చేస్తున్నారు. గుట్టలు, కొండలు, చెరువుల నుంచి మట్టిని తీసి ఇటుకల తయారీకి వాడుకుని రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారు. స్వప్రయోజనాల కోసం కూడా మట్టిని తోడేస్తున్నారు. వెంచర్లు వేస్తున్న రియల్టర్లు ప్లాట్లు వేసేందుకు మట్టితో చదును చేసేందుకు గుట్టలను కరగదీస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టిని తీయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఖాతరు చేయడం లేదు. కొందరు ట్రాక్టర్ల యజమానులు అదే పనిగా మట్టిని తోలి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కాంట్రాక్టర్లు పెద్దపెద్ద నిర్మాణాలకు, ఇతర భవంతుల నిర్మాణాలకు వాడుకుంటూ లాభాలు పొందుతున్నారు. వెదురుకుప్పం, పచ్చికాపల్లం, ప్రాంతాలలో ఇళ్ల వద్ద మట్టి మేటలు కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండడంతో అక్రమార్కుల ఆగడాలకు అవధుల్లేకుండా పోయాయి.

పట్టించుకోని అధికారులు

నిత్యం గ్రామాల సమీపంలోని కొండలు, గుట్టల్లో మట్టిని తోడేస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు. కొందరు అదే పనిగా అక్రమ లాభార్జన కోసం కొండలు, గుట్టలను పిండి చేస్తున్నారు. అయినా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక వారిని నియంత్రించాల్సిన రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఇటువైపు చూసిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టిని తరలిస్తే చర్యలు



ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. గుట్టలు, చెరువుల్లో మట్టిని అక్రమ రవాణా చేయడం తన దృష్టికి రాలేదు. ఇలాంటి సంఘటనలు జరిగితే మా దృష్టికి తీసుకురావాలి. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా ఎవరూ కూడా మట్టిని తీయకూడదు.
– రమేష్‌బాబు, తహసీల్దార్, వెదురుకుప్పం

గుట్టలు మాయం

పచ్చదనంతో ఉన్న గుట్టలు మాయం అవుతున్నాయి. యథేచ్ఛగా గ్రావెల్‌ను తోడి అక్రమంగా తరలిస్తుండడంతో కనుమరుగవుతున్నాయి. భవిష్యత్‌లో జరిగే పరిణామాలను పక్కన పెడితే ప్రస్తుతం కూటమి నేతలకు మాత్రం కాసులు కురిపిస్తున్నాయి. ప్రధానంగా వెదురుకుప్పం, తిరుమలయ్యపల్లె, మారేపల్లె, కొండకిందపల్లె గ్రామాల సమీపంలోని చెరువుల్లో నిత్యం మట్టిని తీసి ఆర్జిస్తున్నారు. దీంతో చెరువుల్లో వర్షపు నీరు నిలిచే ఆస్కారం లేకుండా రైతాంగానికి శాపంగా మారింది.


జేసీబీతో గుట్టను తోడి అక్రమంగా మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

ఈశ్వర్‌రెడ్డికి పరామర్శ


ఈశ్వర్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : మండల పరిధిలోని చింతపెంట పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంఎల్‌ఓ ఈశ్వరరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి మంగళవారం గ్రామానికి వెళ్లి పరామర్శించి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, జయచంద్రారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

శ్రీరంగరాజపురం తహసీల్దార్‌గా లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం : మండల నూతన తహసీల్దారుగా లోకనాథపిళ్లై నియమితులయ్యారు. ఇక్కడే డీటీగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు పూర్తిస్థాయిలో తహసీల్దార్ బాధ్యతలను అప్పగించారు.

ఈడిగలకు ప్రాధాన్యత ఇవ్వండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మద్యం షాపుల కేటాయింపులో కల్లుగీత కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఈడిగ గౌడ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చిత్తూరులో విలేకరులతో మాట్లాడారు.

మామిడిలో ఆధునిక సాగు అవసరం



మాట్లాడుతున్న హార్టికల్చర్ ఆఫీసర్ సౌజన్య, క్షేత్రస్థాయిలో సూచనలు ఇస్తున్న సౌజన్య

పుత్తూరు: మామిడిలో ఆధునిక పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పుత్తూరు ఉద్యానవనశాఖాధికారి సౌజన్య తెలిపారు. మంగళవారం వడమాలపేట మండలం ఎస్వీపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు, పూత, పిందె దశల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో ముందస్తుగా విత్తన ఎంపిక, పొలం తయారీ, విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయాధికారులతో పాటు అనుబంధ శాఖ అధికారులు పొలం బాట పడుతారని తెలిపారు. రోజుకు రెండు గ్రామాల్లో పర్యటించే అధికారులు ముందుగా పొలాలను సందర్శించి, అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వడమాలపేట ఏఓ విజయ్‌కుమార్, పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

శేష వాహనంపై లక్ష్మీనారాయణుడి చిద్విలాసం



గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి మంగళవారం శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి వాహన సేవకు అమెరికాకు చెందిన కృష్ణ కుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం సింహ వాహనంపై స్వామివారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన రాంప్రసాద్ రాఘవన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు కేఎస్ వాసు కుటుంబ సభ్యులు, ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, అర్చకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బరితెగిస్తున్న ఇసుకాసురులు



నీవానది నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం, హిటాచీలను సీజ్ చేసిన అధికారులు

- రూ.కోట్లు గడిస్తున్న ఇసుక అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

గంగాధర నెల్లూరు: ఎన్ని ఆంక్షలు పెట్టినా ఇసుక సరిహద్దులు దాటుతోంది. అక్రమార్కులు అడ్డదారుల్లో పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి కూటమి నేతలు ఇసుకను అక్రమంగా తరలించి రూ.కోట్లు గడిస్తున్నారు. మండలంలోని కొట్రకోన సమీపంలో ఉన్న నీవానదిలో ఇసుకను యంత్రాలు పెట్టి తవ్వి తరలిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల అవసరాలకు స్థానిక వాగులు, వంకలు, నదుల్లో కూలీలతో ఇసుకను తరలించుకోవాలని చెబుతున్నారు. కానీ గంగాధర నెల్లూరులో మాత్రం ఇసుక మాఫియా ఒక ట్రాక్టర్‌కు రూ.1000 చొప్పున వసూలు చేశారు. దీనిపై చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసీల్దారు చంద్రశేఖర్, సీఐ లక్ష్మీనారాయణ బృందం దాడి చేసి ఇసుక అక్రమంగా తవ్వుతున్న రెండు హిటాచీలను సీజ్ చేశారు. గత నెలలో రెండు పర్యాయాలు ఇదే జరిగింది. అధికారులు హెచ్చరించినప్పటికీ అధికార పార్టీ నేతలు బరితెగిస్తున్నారు. అధికారులు ఇసుకాసురులను పట్టుకున్నా.. తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని దౌర్జన్యం చేస్తుండడంతో ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు.

క్వారీలతో రైతులకు నష్టం

- మూగజీవాలు మేతకు వెళ్లలేని పరిస్థితి
- నష్టం కలిగించే క్వారీలు ఆపేయండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నగరి : నగరి సమీపంలోని మురళి, బాలకృష్ణ, సాయిరాం మైనింగ్ క్వారీ వల్ల ప్రజలకు నష్టం కలుగుతోందని వెంటనే ఆర్డీఓ స్పందించి వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కీళపట్టు, నాగరాజకుప్పం క్వారీల వద్ద వారు పార్టీ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరికి అతి సమీపంలో ఉన్న కీళపట్టు నాగరాజకుప్పం దారిలో తరతరాలుగా పరిసర గ్రామాలైన కీళపట్టు, బీసీ కాలనీ, నత్తంకండ్రిగ, గుడికండ్రిగ, కావేటిపురం, బీర కుప్పం, నాగరాజుకుప్పం, కన్నికాపురంలోని ప్రజలు, రైతులు ఇక్కడి గుట్టల్లోనే ఆవులు, మేకలు, మేపుకుంటున్న పరిస్థితి ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం క్వారీల వల్ల పొలాల్లో రాళ్లు పడతాయేమోనన్న భయం రైతులకు కలగడంతో పాటు ఆవులకు మూగజీవులకు మేత లేని పరిస్థితి. చెరువులో పూర్తిగా నీళ్లు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇలాగే కొనసాగితే బోరులో నీళ్లు తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. పేలుడు వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఇంత సమస్య ఉన్నా సంబంధించిన అధికారులు తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహించి వారికి అనుకూలమైన వ్యక్తులతో ఆమోదం తెలిపి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని క్వారీలను ఆపివేయాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి షబ్బీర్ బాష, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు

ఇస్రో పోటీల్లో తడుకు ఆర్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ


విజేత విద్యార్థులతో గైడ్ టీచర్ భానుప్రసాద్

పుత్తూరు: అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో ఈనెల 5వ తేదీ నుంచి 8 వరకు జరిగిన రాత పరీక్షల్లో (మల్టీ చాయిస్ క్వశ్చన్స్) వడమాలపేట మండలం తడుకు ఆర్‌ఎస్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్స్ విభాగంలో 9వ తరగతికి చెందిన రుద్రి ప్రథమ స్థానంలో నిలవగా, జూనియర్స్‌లో 8వ తరగతికి చెందిన హేమ ద్వితీయ స్థానం, కార్తీక తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. తడుకు ఆర్‌ఎస్ విద్యార్థులకు గైడ్ టీచర్‌గా భానుప్రసాద్ వ్యవహరించారు. విజేతలను శ్రీహరికోట సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు భానుప్రసాద్ తెలిపారు.

జయములివ్వు తల్లీ.. జగజ్జననీ


నింద్ర: ధనలక్ష్మి అలంకరణలో మహాలక్ష్మి

- భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు
- ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు

నగరి : నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తులు పోటెత్తుతున్నారు. బుగ్గ అగ్రహారం వన్నూరమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా, నేత్రప్రదాయిణి దేశమ్మ దేవత శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షిదేవి కౌమారిగా కటాక్షించారు. మండలంలో టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవికి కాత్యాయని అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పుత్తూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ద్రౌపదమ్మ, అరేటమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకుముందు అన్ని ఆలయాల్లో ఉదయాన్నే అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కామాక్షీదేవిగా ద్రౌపదీదేవిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువు దీర్చారు. ఆరేటమ్మ మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు.

వడమాలపేటలో: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పూడి క్రాస్ వద్ద అంకాలమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గంగాధరనెల్లూరులో..


లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీఅల్లి ఎల్లమ్మ తల్లి ఆరోరోజు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం దాదాపు 500 మందికి ఆలయ నిర్వాహకులు రవీంద్రారెడ్డి, గుణశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పార్థసారథి రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లి, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మతల్లి, నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరి సమేత గంగాధరేశ్వర పరమేశ్వరీ సమేత అమ్మవారికి విశేష పూజలు చేశారు. చెవుటి గంగమ్మ తల్లిని పుష్పపల్లకిలో సుందరంగా అలంకరించి భక్తులచే ఊరేగించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం శ్రీబంగారమ్మ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు ఎస్.మధు, రవిరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా ద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే మండల పరిధిలోని బాటగంగమ్మ ఆలయంలో, డైట్ ఆవరణలోని రెడ్డి ఇండ్ల వద్ద వెలసిన శ్రీఅంకాళపరమేశ్వరీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.


మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి


శ్రీమహాలక్ష్మిగా దేశమ్మ


వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరి దేవి మంగళవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా చవటగుంటలో మీనాక్షి సమేత అవుదేవ నందీశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులను కటాక్షించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారు మంగళవారం దేవీనవరాత్రుల ఉత్సవాల్లో భాగంలో ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. రూ.500, 200, 100 కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.






గంగాధర పరమేశ్వరికి గంగాదేవి అలంకరణ.., అన్నపూర్ణదేవిగా అల్లియెల్లమ్మ, కార్వేటినగరం : మహాలక్ష్మీదేవిగా శ్రీబంగారమ్మ, మహాలక్ష్మి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు, త్రిపుర సుందరిదేవిగా వన్నూరమ్మ, పుత్తూరు: కామాక్షీదేవిగా ద్రౌపదీదేవి, కాత్యాయనిగా అన్నపూర్ణేశ్వరి, కౌమారి అలంకరణలో కామాక్షీదేవి